క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐటీఐ విద్యార్థులు 60 మందికిపైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

వర్ధన్‌రెడ్డి విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నగరంలోని వర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీ–నీట్ అకాడమీ విద్యార్థిని అర్షియా 99.45 పర్సంటైల్‌తో ఆల్‌ఇండియా ర్యాంకు 1239 సాధించిందని తెలిపారు. వెంకటశ్రీనాథ్ 90.83, లలిత్‌కుమార్ 88.09, జ్యోత్స్నప్రియ 87.47, అబ్దుల్‌హఫీజ్ 86.09 పర్సంటైల్ సాధించారని వివరించారు. 50 శాతానికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపల్ నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

నృత్యకళాకారిణికి సన్మానం



మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి పూర్ణిమను మనుబోలు ఎంపీటీసీ దువ్వూరు రాజేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. కోదండరామపురంలో శ్రీసీతా రామాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన సీతారామ కల్యాణం సందర్భంగా పూర్ణిమ కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలుకే బంగారమాయేనా అనే పాటకు పూర్ణిమ ప్రదర్శించిన హావభావాలు, నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో పూర్ణిమను కార్యక్రమ నిర్వాహకులతో కలిసి వారు సన్మానించి అభినందించారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



ముత్తుకూరు : రైతులు ఎడగారు సీజన్‌లో వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండల కేంద్రంలో మునునూరువారిపాళెం, బ్రహ్మదేవి, దువ్వూరువారిపాళెం రైతులతో ఏడీఏ శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా విత్తనాలు అందుబాటులో ఉంచడంపై రైతులతో చర్చించారు. ప్రత్యామ్నాయ పంటల కింద ఎలాంటి పంటలు సాగు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు చక్రవర్తి, జ్యోత్స్నరాణి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన బాబు

- 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



44వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబునాయుడు అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి విమర్శించారు. నగరంలోని 40వ డివిజన్‌లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌తో కలిసి శుక్రవారం ఉదయం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం 44వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ నీలి రాఘవరావుతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ధనవంతులు, వ్యాపారాలు చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండని టీడీపీ అభ్యర్థులు కావాలో.. ప్రజలకు అందుబాటులో ఉండే సామాన్యులైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కాంట్రాక్ట్ పనులను నాసిరకంగా చేపట్టి ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. నెల్లూరు సిటీ అభ్యర్థి విద్యను వ్యాపారంగా మార్చేశారన్నారు. మహిళలను సైతం మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత టీడీపీ అభ్యర్థులు వారి వ్యాపారాల్లో మునిగిపోతారన్నారు. ప్రజలను ఏ మాత్రం పట్టించుకోరన్నారు. వారిద్దరూ డబ్బు సంచులతో ఓట్లను కొనుగోలు చేసేందుకు వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రత్యర్థులు ఆరోపిస్తున్నట్లుగా తానెక్కడికి వెళ్లనని, తాను పుట్టి పెరిగిన నెల్లూరులోనే ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని అందుబాటులో ఉంటానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పేదవాడు, సామాన్యుడైన ఖలీల్ అహ్మద్‌ను పోటీలో నిలిపారన్నారు. ఆయన నిత్యం ప్రజలతోనే ఉంటాడన్నారు. పుట్టిన జిల్లా నుంచి తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు.

రౌడీయిజాన్ని సాగనివ్వబోం

నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూప్ కుమార్‌యాదవ్ రౌడీయిజం చేస్తున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఇకపై వారి రౌడీయిజాన్ని సాగనివ్వబోమన్నారు. గతంలో చంద్రబాబు బీజేపీతో దోస్తీ చేసి తప్పు చేశానని బహిరంగంగా చెప్పాడన్నారు. ఇప్పుడు మళ్లీ అదే తప్పు చేశాడన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దివంగత సీఎం వైఎస్సార్ ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని కులాలు, మతాలను సమానంగా చూసే సెక్యులర్ పార్టీ అన్నారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతి చోట ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారన్నారు. జిల్లాకు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి రావడాన్ని ప్రజలు ఎంతో అదృష్టంగా భావిస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లు కనిపించకుండా పోయిన నారాయణ ఇప్పుడు వచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. నెల్లూరు సిటీ నుంచి పోటీ చేస్తున్న సామాన్యుడినైన తనను ఆశీర్వదించాలని కోరారు.



40వ డివిజన్‌లో వృద్ధురాలికి కరపత్రాలు అందజేస్తున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు అభివృద్ధిలో జైనులు కీలక పాత్ర

నెల్లూరు(బృందావనం): నెల్లూరు అభివృద్ధిలో జైనులు కీలక పాత్ర పోషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలోని 46వ డివిజన్, మండపాల వీధిలోని జైన్ కమ్యూనిటీ హాల్లో జైనుల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. తొలుత భగవాన్ మహావీర్ మందిరాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ భగవాన్ మహావీర్ చూపిన సత్యమార్గం సమస్యలను దూరం చేస్తుందన్నారు. జైనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మమార్గాన్ని విడవరని ప్రశంసించారు. ఈ సమావేశంలో 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్, జైన మత ప్రముఖులు పాల్గొన్నారు.

దుర్మార్గులకు ఓటుతో బుద్ధి చెప్పండి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దుర్మార్గులను ఎన్నుకుంటే సంక్షేమాభివృద్ధి నిలిచిపోతుందని, అరాచక శక్తులు తాండవిస్తాయని, దుర్మార్గులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 12వ డివిజన్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ రూరల్ ప్రజలు శాంతియుత పాలనను కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా తాను రూరల్‌లో ప్రశాంతత నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూరల్ నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాటును అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగించి ఆదుకున్నారని గుర్తుచేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, నరసింహులు గౌడ్, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, క్లస్టర్–1 అధ్యక్షుడు ముడియాల రామిరెడ్డి, 12వ డివిజన్ అధ్యక్షుడు పొట్లూరు జయవర్ధన్, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లను పెంచండి



మాట్లాడుతున్న డీఈఈ మధుసూదన్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సిబ్బంది డీలిస్టులపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ వసూళ్లను పెంచాలని నెల్లూరు టౌన్–2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున విద్యుత్ సిబ్బందితో పాటు అవుట్ సోర్సింగ్, షిఫ్ట్ ఆపరేటర్లు రాజకీయ సమావేశాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో ఆదాల



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో గతేడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులతో ప్రజల గుండెల్లో తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిలిచిపోయారని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తన తండ్రికి మద్దతుగా 24వ డివిజన్ సుందరయ్యకాలనీ, జాషువానగర్, తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా తన తండ్రి బాధ్యతలు చేపట్టాక రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రిని ఆశీర్వదిస్తే రూరల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, నాయకులు వేలూరు శ్రీధర్‌రెడ్డి, పాశం తిరుపతి, కల్లూరు లక్ష్మిరెడ్డి, ముంగమూరు భార్గవిరెడ్డి, క్లస్టర్–2 అధ్యక్షులు పాతపాటి పుల్లారెడ్డి, స్థానిక నాయకులు పామూరు మస్తాన్‌రెడ్డి, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లో ఉన్న షార్ కాలనీ, బ్యాంకు కాలనీల్లో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరు సురేష్‌బాబు, క్లస్టర్–2 ఉపాధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యేగా అదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ రసూల్, దిలీప్‌కుమార్‌రెడ్డి, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కండే అబ్రహం డానీ, విజయ్ కుమార్, రాజా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు చేపడుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్, పొర్లుకట్ట, పుత్తా ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో ఉదయ 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా ఉండదు. రంగనాథ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోపురంవీధి, బుజ్జమ్మరేవు, ఉప్పరపాళెం, ఇసుకడొంక, గురుతోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు సరఫరా ఉండదు. జగదీష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ, చిల్డ్రన్స్ పార్కు రోడ్డు, రాంజీనగర్, జగదీష్‌నగర్, బాలాజీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదు. బుజబుజనెల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో శనివారం సాయంత్రం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహ్మదాపురం వద్ద ఉన్న కార్పొరేషన్‌కు తాగునీటిని సరఫరా చేసే 120 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌లోని క్లియర్ వాటర్ పంపింగ్ స్టేషన్‌లో శనివారం ఉదయం మరమ్మతులు చేపట్టనున్న కారణంగా తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. 28న ఉదయం నుంచి మంచినీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వేడుకగా ఏకాంతసేవ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఏకాంతసేవతో ముగిశాయి. ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, అభిషేకం, చతుర్వేదపారాయణం విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఇడపలపాటి వెంకటేశ్వర్లు, ఇడపలపాటి శ్రీనివాసరావు, ఇడపలపాటి కోటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఆలయ పాలక మండలి అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, ఎస్వీ రత్నం, కోశాధికారి టీ మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను కార్పొరేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సమక్షంలో శుక్రవారం చేపట్టారు. మొత్తం 26 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వివిధ కారణాలతో 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 18 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. టీడీపీ తరఫున పొంగూరు రమాదేవి, పొంగూరు సింధూర దాఖలు చేసిన నామినేషన్లను తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ నుంచి మహ్మద్ నసీమా దాఖలు చేసిన నామినేషన్‌తో పాటు సీపీ ఐ(ఎం), ఇండియన్ ప్రజా కాంగ్రెస్, ముగ్గురు ఇండిపెండెంట్లు వేసిన నామినేషన్లను తిరస్కరించారు.

మాదిగలను మోసం చేసిన చంద్రబాబు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎమ్మార్పీఎస్ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన చంద్రబాబును మాదిగలు నమ్మే పరిస్థితిలో లేరని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తూరులో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నవ్యాంధ్ర పని చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీకు మద్దతు ఇస్తున్నట్లుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు రత్నం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కుమార్, దామోదర్, రవి, ఏడుకొండలు, పృథ్వీ, రాజా, తేజ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు



వైఎస్సార్‌సీపీకు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాకుడు బ్రహ్మయ్యమాదిగ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్‌భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ మనువాదంతో బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందన్నారు. ఎన్డీయే కూటమిని మాదిగలు నమ్మే స్థితిలో లేరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన ఎన్డీయే కూటమి పదేళ్లు గడిచినా పట్టించుకోలేదని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న మాట తప్పని, మడిమ తిప్పని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తామన్నారు. ఎన్డీయే కూటమికి మంద కృష్ణమాదిగ అండగా ఉన్నాని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలోకి వచ్చాక ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణచివేసి, కార్యకర్తలపై కేసులు బనాయించిన చంద్రబాబుకు ఆయన మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. నాయకులు గోపి, రమేష్, రమణయ్య, స్వర్ణక్క, సుధాకర్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఆదాలపై దుష్ప్రచారం



నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ నాయకులు ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ ప్రభాకర్ అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు గిరిధర్‌రెడ్డి అక్రమ అరెస్టులు అంటూ నాటకాలు ఆడుతున్నారన్నారు. గడిచిన తొమ్మిది నెలల్లో రూ.150 కోట్లతో రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఆదాల ప్రభాకర్‌రెడ్డిదేనన్నారు. భూకబ్జాలు, దందాలు, అవినీతి పనులు కోటంరెడ్డి నైజమన్నారు. త్వరంలో జరగనున్న ఎన్నికల్లో రూరల్ ప్రజలు కోటంరెడ్డిని ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి, తాళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక



పార్టీలో చేరిన యువతతో ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వందవాసి రంగా ఆధ్వర్యంలో 50 మంది యువకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. రామ్మూర్తినగర్‌లోని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

స్థాయి మరిచి విమర్శలు మానుకోవాలి



గాంధీగిరిజన కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తన స్థాయి మరిచి వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని 53వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాగి వెంకటరమణ హితువుపలికారు. నగరంలోని గాంధీగిరిజన కాలనీలో శుక్రవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నగరాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం వెంకటేశ్వరపురంలో నిర్వహించిన టీడీపీ రోడ్ షోలో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పెన్నానది ఒడ్డున చిన్న పిట్టగోడ కట్టి నరసరావుపేటకు వెళ్లాడని ఆరోపించడం సరికాదన్నారు. అది పిట్టగోడ కాదని 53,54 డివిజన్లు పెన్నానది నది వరదలకు ముంపునకు గురవకుండా రూ.100 కోట్లతో నిర్మిస్తున్న రక్షణ గోడ అన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో అశ్వ వాహనసేవ



శబరి శ్రీరామక్షేత్రంలో ఏకాంతసేవ

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ఊంజల్‌సేవను నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తగా అమర్తలూరు భాస్కర్, అరుణ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వెన్నతాళి ఉత్సవం, అశ్వవాహనసేవను నిర్వహించారు. ఉభయ కర్తలుగా దోనిపర్తి గిరిప్రసాద్, వాణి దంపతులు, మాలకొండారెడ్డి దంపతులు వ్యవహరించారు.
- శబరి శ్రీరామక్షేత్రంలో ఏకాంతసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం దయాకర్‌గౌడ్, సుబ్బరత్నమ్మ దంపతులు వ్యవహరించారు.